నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 9 అక్టోబర్ 2024 | HYDERABAD




**రేపు సద్దుల బతుకమ్మ**

పుష్పాలతో దేవుడిని పూజిస్తాం. అలాంటి పువ్వులనే దైవంగా భావించి కొలిచే అద్భుతమైన సంప్రదాయ పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు చిన్నా, పెద్ద అంతా ఉత్సాహంగా పాటలు పాడుతూ ఆడుకుంటారు. గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో మహానగరంలోని మార్కెట్లన్నీ సందడిని తలపిస్తున్నాయి. -సిటీబ్యూరో



**రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు**

దేవీ నవరాత్రుల సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



# కూల్చుడు.. కూల్చుడే!

## పండుగ తర్వాత బలవంతంగా ఖాళీ చేయించేలా అధికారుల వ్యూహాం?

- రెడ్ మార్క్ ఇండ్ల యజమానులను ఒప్పించలేకపోతున్న అధికారులు
- తమ ఇండ్లు కూల్చనివ్వబోమంటున్న బాధితులు

> ప్రభుత్వం మూసీ నివాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఈ నేపథ్యంలో మూసీ వెంట తమ రెక్కల కష్టంతో నిర్మించుకున్న ఇండ్లకు అధికారులు రెడ్ మార్క్ వేశారు. ప్రస్తుతానికి కూల్చివేతల ప్రక్రియకు విరామం ఇచ్చినా... దసరా తరువాత ఎలాగైనా కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా, మూసీ నిర్వాసితులు అదే స్థాయిలో తమ ఇండ్లను కూల్చనివ్వబోమంటూ శపథం చేస్తున్నారు. అయితే రివర్ బెడ్ కూల్చివేతలే సమస్యగా మారడంతో బఫర్ జోన్ జోలికొస్తే నిర్వాసితులను ఎదుర్కోవడం కష్టమేనని అధికారులు చర్చించుకుంటున్నారు.

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : కూల్చివేతలతో మూసీ నిర్వాసితులను బెంబేలెత్తించిన అధికారులు ఆ దమనకాండకు కాస్త బ్రేకులేశారు. దసరా సెలవుల దృష్ట్యా ఇండ్ల కూల్చివేతలు, ఇప్పటికే కూల్చేసిన నిర్మాణాల శిథిలాల తరలింపు, రెడ్ మార్క్ ఇండ్లను కూల్చివేసే ప్రక్రియలన్నింటికీ అధికారులు విరామం ఇచ్చినట్టు తెలిసింది. ముఖ్యంగా సైదాబాద్ మండలంలో 72 ఇండ్లకు రెడ్ మార్క్ వేసిన అధికారులు ఆ ఇంట్లో ఉంటున్న వారికి డబుల్ బెడ్‌రూంలు అందిస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే అందులో చాలా వరకు తమ రెక్కల కష్టంతో నిర్మించిన ఇండ్లను కూల్చొద్దంటూ అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో సైదాబాద్ నిర్మాణాలను తొలగించడం అధికారులకు సవాల్‌గా మారింది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి కూల్చివేతలు తప్పవంటూ తన ప్రసంగాల్లో హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రెడ్ మార్క్ వేసిన ఇండ్లను బలవంతంగానైనా కూల్చేసేలా వ్యూహాలకు పదును పెడుతున్నట్టు సమాచారం. దసరా సెలవుల తర్వాత ఈ వ్యూహం అమలు చేయబోతున్నారని తెలిసింది. కాగా, మూసీ నిర్వాసితులు సైతం తమ ఇండ్లను కూల్చనివ్వబోమంటూ శపథం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన దుర్మార్గంగా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, జిల్లాలో రివర్‌బెడ్ నిర్మాణాలు 1595 ఉన్నట్టు అధికారులు తెలిపారు. అత్యధికంగా నాంపల్లి, బహదూర్‌పురలో ఉన్నట్టు వివరించారు.

**కనిపించని పండుగ సందడి..**

మూసీ నిర్వాసితులకు బతుకమ్మ సంబురాలు కూడా లేవని పలువురు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హిమాయత్‌నగర్‌లోని మూసానగర్, శంకర్ నగర్‌లో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. వారందరినీ డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించినట్టు అధికారులు వివరించారు. అయితే వీరిలో ఏ ఒక్కరూ కూడా తమ ఇల్లును కూల్చడానికి అంగీకరించలేదు. అధికారుల భయభ్రాంతుల మధ్య ఇండ్లను బలవంతంగా ఖాళీ చేయాల్సిన దుస్థితి తమదని కొందరు వాపోయారు. ఇప్పుడు ఈ భయం రివర్ బెడ్ దాటి బఫర్ జోన్ వరకు విస్తరించింది. ఇటీవల సీఎం బఫర్ జోన్ నిర్మాణాలను సైతం తొలగించాల్సిందేనని ప్రకటించడంతో అధికారులు ఆ మేరకు కూడా ప్రణాళికలు చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా సంబురం.. మూసీ నిర్వాసితుల ప్రాంతాల్లో పెద్దగా కనిపించడం లేదు. తమ గూడు పోతుందనే భయంలోనే వాళ్లంతా ఉన్నారు. మరోవైపు తమ ఇండ్లు కోల్పోయిన ప్రాంతాల్లోనే తమకు ఇండ్లు ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ దొరికే పనిపై ఆధారపడిన తమ బతుకులను వేరే ప్రాంతానికి తరలిస్తే ఎలా బతికేది అంటూ ఆందోళన చెందుతున్నారు. మూసీ బఫర్ జోన్ పరిధిలో గతంలో నిర్వహించిన డ్రోన్ సర్వే ప్రకారం మొత్తం 7,850 నిర్మాణాలు ఉన్నట్టు హైదరాబాద్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇందులో హైదరాబాద్‌లో 5250 నిర్మాణాలు ఉన్నట్టు తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్‌లో 2600 వరకు నిర్మాణాలు ఉన్నట్టు తెలిపారు. అయితే వాస్తవ పరిస్థితి మరోలా ఉందని నిపుణులు చెబుతున్నారు. వేలాది కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయని తెలిపారు. సరైన నిర్ధారణ లేకుండా లెక్కలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రివర్ బెడ్ కూల్చివేతలే గగనంగా మారడంతో బఫర్ జోన్ జోలికొస్తే నిర్వాసితులను ఎదుర్కోవడం కష్టమని అధికారులు చర్చించుకుంటున్నారు.

## పేదల ఇండ్లకు నష్టం లేకుండా

# మూసీ ప్రక్షాళన చేపట్టాలి

- మూసీ బాధిత ప్రజల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు

**పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గం**

చిక్కడపల్లి, అక్టోబర్ 8 : పేదల ఇండ్లకు నష్టం లేకుండా మూసీ ప్రక్షాళన చేపట్టాలని వామపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర నాయకుడు ఎం.మహేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి ఎం.వరలక్ష్మి, సీపీఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఝాన్సీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు ఎస్.ఎల్.పద్మ, సీపీఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు సంధ్య, మానవ హక్కుల నేత సయ్యద్ బిలాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన జరగాలి, దానికి అవసరమైన చర్యలు చేపట్టాలి అంతేకానీ.. ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో వేలాది మంది పేదలు, మధ్యతరగతి ప్రజల ఇండ్లను తొలగించాలనుకోవడం సమంజసం కాదన్నారు. టూరిజం అభివృద్ధి కోసం, కార్పొరేట్ కంపెనీల వ్యాపారాల కోసం పేదల ఇండ్లను తొలగించాలనుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌తో సహా ఎలాంటి ప్రతిపాదనలు లేకుండానే ఇండ్ల తొలగింపునకు పూనుకోవడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. మూసీ ప్రాజెక్టులో ప్రభుత్వం చేపట్టదలచిన అభివృద్ధి పై విస్తృత చర్చలు జరిపిన తర్వాత ప్రజల ఆమోదంతో ముందుకెళ్లాలన్నారు. మూసీ నది పరిసరాల్లో నివసిస్తున్న వేలాది మంది పేదలను అభివృద్ధిలో భాగస్వాములు చేయకుండా, వాళ్ల ఉపాధిని పట్టించుకోకుండా, ఏకపక్షంగా నగరం అవతలకు పంపించే చర్యలు ప్రజాపాలన అనిపించుకోదన్నారు. మూసీ నిర్వాసిత ప్రజలతో వారి నివాస హక్కుల కోసం, ప్రభుత్వ బెదిరింపు చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడుతాయని వారు ప్రకటించారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు

# 25 మంది సీఐలు బదిలీ

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 25 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సీపీగా సుధీర్‌బాబు బాధ్యతలు చేపట్టిన తరువాత అధికారుల పనితీరును పరిశీలించి మొదటి సారిగా 25 మందిని బదిలీ చేశారు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)

## విద్యుత్ శాఖలో

# బదిలీలపై సందిగ్ధం!

**గడువు ముగిసినా ప్రకటించని జాబితా**

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో బదిలీలపై సందిగ్ధత నెలకొంది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియకు సోమవారంతో గడువు ముగిసిన వెంటనే జాబితా ప్రకటించాల్సిన డిస్కం ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం వరకూ దాన్ని ప్రకటించలేదు. దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రత్యేకంగా బదిలీల్లో పారదర్శకత కోసం సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, ప్రత్యేకంగా మార్గదర్శకాలను రూపొందించారు. బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాను హోదాల వారీగా విడుదల చేసి, వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఎక్కడ కావాలో ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఈ బదిలీ ప్రక్రియ సాఫీగా, వేగంగా ముగుస్తుందని భావించారు. సాఫ్ట్‌వేర్‌లో వెబ్ కౌన్సెలింగ్ గడువు 7వ తేదీ అర్ధరాత్రి వరకు ముగిసినా, మరుసటి రోజైన మంగళవారం బదిలీలకు సంబంధిత జాబితాను వెంటనే ప్రకటించాల్సి ఉంది. దీనికి కారణం పెద్దల నుంచి ఒత్తిళ్లేనని తెలుస్తున్నది.

సుమారు 850 మందిని బదిలీ చేయాలని నిర్ణయించగా, అందులో 25 నుంచి 30 పోస్టులకు పైరవీలు ఎక్కువగా జరిగాయని విద్యుత్ శాఖలో చర్చ జరిగింది. దక్షిణ డిస్కం పరిధి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 10 సర్కిళ్లలోనే పోస్టింగ్‌ల కోసం ఉద్యోగులు ఎక్కువ ఆసక్తిని కనబర్చారు. వెబ్ కౌన్సెలింగ్ విధానం ఉన్నా.. సచివాలయం నుంచి ఆదేశాలు తెచ్చుకునేందుకు కొంత మంది ప్రయత్నిస్తూనే ఉండటంతోనే ఉద్యోగుల బదిలీల జాబితాను ప్రకటించలేకపోతున్నారని సమాచారం. మరోవైపు డిస్కంలోని హెచ్‌ఆర్ విభాగం అధికారులు మింట్ కాంపౌండ్‌లోని ప్రధాన కార్యాలయంలో కాకుండా ఎర్రగడ్డ-జీటీఎస్ కాలనీలో ఉన్న విద్యుత్ శాఖకు చెందిన కార్యాలయంలో బదిలీల తుది జాబితాపై కసరత్తు చేసినట్టు సమాచారం. మొత్తంగా విద్యుత్ శాఖలో బదిలీల ప్రక్రియ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేమని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# దారులు.. దారుణం

గ్రేటర్‌లో ఏ రోడ్డు చూసినా.. ఏ ప్రాంతంలో చూసినా గుంతలే..!! ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రోడ్ల దాకా సాఫీగా ప్రయాణించేందుకు వీల్లేకుండా ఉన్నవి. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. గడిచిన కొన్ని రోజులు వర్షాలు లేకపోయినప్పటికీ పాడైన రహదారుల మరమ్మతుల్లో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యం చేస్తున్నది. 25వేలకు పైగా పాట్‌హోల్స్ ఏర్పడినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా, మరమ్మతు పనులను మాత్రం చేపట్టడం లేదు. ఈ క్రమంలో నిత్యం వందలాది మంది నుంచి జీహెచ్‌ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు స్పందించడం లేదు. దీంతో చాలా చోట్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)

**ఐఆర్‌సీ నిబంధనలకు తూట్లు..**

జీహెచ్‌ఎంసీ పరిధిలో 9,013 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. ఇందులో 2,846 కిలోమీటర్లు బీటీ రోడ్లు, 6,167 కిలోమీటర్ల మేర అంతర్గత రోడ్లు ఉన్నాయి. ఇందులో 70% రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. 709 కిలోమీటర్ల మేర ఉన్న సీఆర్‌ఎంపీ రోడ్లు మినహా మిగతా అన్ని రోడ్లు గుంతలతోనే దర్శనమిస్తున్నాయి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) ప్రకారం బీటీ రోడ్డు వేస్తే ఆరేళ్ల వరకు, సీసీ రోడ్డు అయితే 10 ఏండ్ల వరకు ఉండాలి. కానీ ఇప్పుడు వేసిన రోడ్లు నెలల వ్యవధిలోనే పూర్తిగా గుంతలు పడుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో అధికారులు, కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడుతుండటంతోనే రోడ్లు త్వరగా డ్యామేజ్ అవుతున్నాయన్న విమర్శలు లేకపోలేదు.

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- 25వేలకు పైగా పాట్‌హోల్స్ ఉన్నట్లు అంచనా
- దెబ్బతిన్న రోడ్లను పట్టించుకోని అధికారులు
- నరకంగా మారిన ప్రయాణం

**ఈ ప్రాంతాల్లో ప్రయాణం నరకం..**

బంజారాహిల్స్‌లోని ఏసీబీ క్వార్టర్స్, జూబ్లీహిల్స్, నానల్‌నగర్, మెహిదీపట్నం, షేక్‌పేట, ప్యారడైజ్, రాంగోపాల్‌పేట, మూసారంబాగ్, బాలానగర్, ఎర్రగడ్డ, బహదూర్‌పురా, ఎల్‌బీ నగర్, కుత్బుల్లాపూర్, పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు ఎక్కువగా డ్యామేజ్ అయ్యాయి. నారాయణగూడ నుంచి రామంతాపూర్‌కు వెళ్లే ప్రయాణికులు అరగంట పాటు నరకం చూపే రహదారిపై ప్రయాణం తప్పదు. అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా నుంచి ముఖ్రం హోటల్ వరకు మోకాలులోతు గుంతలు ఏర్పడ్డాయి. పంజాగుట్ట సాయిబాబా కాలనీ, డీడీ కాలనీ, నల్లకుంట కూడలి, జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండగా.. వేరే రూట్ల నుంచి వెళుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. వాహనాలు కాస్తా స్పీడ్‌గా వెళితే స్కిడ్ అయి వాహనదారులు కింద పడుతున్నారు. దీంతో వీలైనంత త్వరగా గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.





సికింద్రాబాద్‌లో గుజరాతి రోడ్డు, ఇందిరా పార్కు వద్ద రోడ్డు పై ఏర్పడ్డ భారీ గుంతలు



అత్తాపూర్‌లో పారిశుధ్య నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

# పారిశుధ్యంపై దృష్టి సారించాలి

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి**

సిటీబ్యూరో, అక్టోబర్ 8: పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చార్మినార్ జోన్‌లోని అత్తాపూర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్, మీర్‌ఆలం ట్యాంక్, బహదూర్‌పుర తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, స్థితిగతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఈ విషయంలో ప్రజలు పరిశుభ్రత పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేలా పర్యవేక్షించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌లను తొలగించాలని, సీ అండ్ డీ వేస్ట్‌ను ప్రత్యేక వాహనాల ద్వారా తరలించాలని సూచించారు. దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలన్నారు. కమర్షియల్ స్ట్రెచెస్‌లో వ్యర్థాలు వెంటనే తీసుకొని పోయేలా చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు సూచించారు.